క్లుప్తంగా

వాటర్ కూలింగ్ ఫ్రిడ్జ్ బహూకరణ



జంగారెడ్డిగూడెం విజయదుర్గమ్మ ఆలయంలో దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయానికి దాతలు రూ.15 వేల విలువ గల వాటర్ కూల్ ఫ్రిడ్జ్ బహూకరించినట్లు ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి మాదా రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం దాతలు కొండూరు కృష్ణమూర్తి, కొండూరు అంజేశ్వరరావు, రత్నావతి దంపతులు, కొండూరు హనీష్, వాసవి దంపతులను సత్కరించారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మలాథియాన్ స్ప్రేయింగ్



కుంకాలలో మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి సురేష్

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్ డీపేట పీహెచ్‌సీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మొదటి విడత మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభించినట్లు పోలవరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు తెలిపారు. మనుగోపుల, కుంకాల గ్రామాల్లో నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి సురేష్, ఎల్ఎన్‌డీపేట వైద్యాధికారి నిఖిల్ పరిశీలించినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలు ఇంటి లోపల, బయట ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు

దెందులూరు: వైఎస్సార్ సీపీ విజయానికి రేయింబవళ్లు శ్రమించిన వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం దెందులూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం కారణంగా దెందులూరు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేయటం ఖాయమన్నారు. ఎమ్మెల్యేగా తనకు దెందులూరు నియోజకవర్గంలో అండగా నిలబడి, ప్రతి విషయంలో మద్దతునిచ్చిన ప్రతి ఒక్కరి కృషి, సేవ ఎన్నటికీ మరువనని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన సేవలందించిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తెలిపారు. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి జగనన్న, తనపై అభిమానంతో నమ్మకంతో ఓటు వేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, దెందులూరును ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో రెడ్‌క్రాస్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బృందంతో తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బంధువులు హాజరయ్యారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు, కన్సల్టెంట్ పిడియాట్రిక్ హెమటో అంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో తలసేమియా కేసులు పెరగటానికి ముఖ్యకారణం ప్రజల్లో వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవటమే అన్నారు. 6 నెలల నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటే వైద్యుల సలహా మేరకు తలసేమియా, హిమోఫిలియా వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తలసేమియా పిల్లలకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ పరిష్కారం ఉన్నప్పటికీ మ్యాచింగ్ దాత దొరకాలని, ఇది ఖర్చుతో కూడినది కావటంతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సహకారంతో కొందరు బాధితులకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేస్తున్నామని వివరించారు. ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా సుమారు 10 వేల మందికి పైగా తలసేమియా భారినపడుతున్నారని చెప్పారు. ఈవ్యాధి బాధితులకు జీవితాంతం రక్తమార్పిడి చికిత్స, మందులు వాడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి నెలా అనేకమంది తలసేమియా బాధితులకు ఏలూరులో రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నామని, అనేక మంది దాతలు సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారని వివరించారు. తలసేమియా స్క్రీనింగ్ క్యాంపునకు హాజరైన బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు 150 మందికి భోజన సదుపాయాన్ని కల్పించిన మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

గిరిపుత్రులకు ఉపాధి మకరందం

- మారుమూల గిరిపల్లెల్లో తేనెటీగల పెంపకం
- ఐటీడీఏ సహకారంతో రెండు యూనిట్ల ఏర్పాటు
- స్వచ్ఛమైన తేనె తయారీకి పెరిగిన డిమాండ్
- ఏజెన్సీలోని 2 తేనె పరిశ్రమ యూనిట్ల నిర్వహణ
- తేనెటీగల పెంపకం, తేనె తయారీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్న అధికారులు
- పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి పొందుతున్న గిరిజనులు



కామయ్యకుంటలో తేనెను తయారుచేస్తున్న గిరిజనులు (ఫైల్)



గోగుమిల్లిలో తేనెను తయారు చేస్తున్న గిరిజనులు (ఫైల్)



గిరిజనులు తయారు చేసిన తేనె పట్టును చూపిస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: ఆహార ఔషధాల్లో తేనెకు ఒక విశిష్టత ఉంది. ప్రకృతి సిద్ధంగా లభించే తేనె ఆయుర్వేద చికిత్సలో ఉపయోగించే ముఖ్యమైన ద్రవం. అయితే పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని అటవీప్రాంతంలో గిరిపుత్రులు సేకరించే తేనెకు అత్యంత ప్రత్యేకత ఉంది. అటవీప్రాంతంలోని పలురకాల వనపుష్పాల నుంచి సేకరించిన మకరందాన్ని స్వీకరించిన తేనెటీగల నుంచి ఈ తేనె ఉత్పత్తి కావడమే దీని స్వచ్ఛత, నాణ్యతకు కారణం. అయితే ఎన్నో ఏళ్లుగా అడవిలో లభించే తొర తేనె, పట్టుతేనె గిరిజనులకు ఆదాయ వనరులుగా ఉంది. వారు అటవీ ప్రాంతంలో సేకరించిన తేనను గిరిజన సహకార సంస్థలకు విక్రయించి ఆదాయ వనరులు పొందేవారు. అయితే తేనె సేకరణ సమయంలో చెట్ల మీద నుంచి పడి ప్రమాదాలకు గురికావడం, తేనె టీగల దాడికి గురికావడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గిరిజనులను ప్రమాదాల నుంచి కాపాడి తేనెటీగల పెంపకం ద్వారా ఆదాయాన్ని పెంపొందించే విధంగా బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ ద్వారా ఏపీఎస్ఎస్‌డీసీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మన్యప్రాంతంలోని గిరిజనులతో కామయ్యకుంట, గోగుమిల్లి, తదితర గ్రామాల్లో తేనె పరిశ్రమను ఏర్పాటు చేయడం జరిగింది.

60 మందితో 2 యూనిట్ల ఏర్పాటు

తేనె సేకరణ ద్వారా జీవనం సాగిస్తున్న గిరిజనులు కొందరికి చెట్లు ఎక్కడంతో పాటు తేనెటీగల దాడికి గురై పలు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తేనె సేకరణే జీవనంగా సాగిస్తున్న గిరిజనులకు జోవనోపాధి కల్పించడంతో పాటు ప్రమాదాల నుంచి తప్పించేందుకు గిరిజనులతో తేనె పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరిగింది. 60 మంది సభ్యులను ఏర్పాటు చేసిన కామయ్యకుంట గ్రామంలో 30 మందితో గోగుమిల్లి గ్రామంలో మరొక 30 మందితో రెండు తేనె పరిశ్రమ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగింది. వీరికి ఎక్స్ ట్రాక్టర్-1, హ్యాండ్ గ్లౌజ్‌లు-30, హైవ్‌టూల్స్- 30, నైఫ్‌లు-30, తేనె టీగల నుంచి రక్షణకు మాస్కులు- 30, హనీ బాక్స్ అండ్ స్టాండ్స్- 150, వాక్స్ కట్టింగ్ ట్రే-1, హనీ పాంటింగ్-1 చొప్పున అందించారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపల్లెల్లో యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్న తేనెను గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, కాకినాడ, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ తేనే గిరాకీ ఎక్కువగా ఉండటంతో ఆదాయం కూడా అధికంగా లభిస్తుందని గిరిజనులు చెప్తున్నారు. గతంలో తేనె బాటిల్ రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.800 నుంచి రూ.1000 వరకూ విక్రయిస్తున్నారు. దీనితో ఖర్చులకు పోనూ సుమారు రూ.లక్ష వరకూ ఆదాయం ఉంటుందని గిరిజనులు చెప్తున్నారు. కరోనా కష్టకాలంలో విక్రయాలు మందగించి కాస్త ఇబ్బంది పడినప్పటికీ ప్రస్తుతం మళ్లీ తమ యూనిట్ల ద్వారా తయారు చేస్తున్న తేనెకు ఆర్డర్స్ ఎక్కువగా వస్తున్నట్లు గిరిజనులు చెప్తున్నారు.

పలు గిరిపల్లెల్లో సొంతంగా తేనె తయారీ

తేనె తయారీ విధానం నేర్చుకున్న అనేక మంది గిరిజనులు పలు గ్రామాల్లో వారే సొంతంగా తేనె తయారీ చేసుకుని విక్రయిస్తున్నారు. పెట్టెల్లో ఈగలను తీసుకువచ్చి తద్వారా నాణ్యమైన తేనెను తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. లక్ష్మీపురం, కామయ్యకుంట, రెడ్డిగూడెం తదితర గ్రామాల్లో తేనె లభిస్తుంది. ఇదిలా ఉండగా పలువురు అడవిలో సేకరించిన తేనెను కూడా గ్రామాల్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

తేనె విక్రయాలు పెరిగాయి



ఏజెన్సీ ప్రాంతంలోని అడవుల్లో నాణ్యమైన తేనె లభిస్తుంది. అటవీప్రాంతానికి వెళ్లి చెట్లలో పట్టిన తేనెను తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. గతంలో జీసీసీకి అమ్మకాలు చేసేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామానికే అత్యధికంగా ప్రజలు వచ్చి తేనె కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం తేనె విక్రయాలు పెరిగాయి.

–కె.పోసి, తేనె తయారీ, విక్రయదారుడు, కామయ్యకుంట, బుట్టాయగూడెం మండలం

ఇతర ప్రాంతాలకూ విక్రయిస్తున్నాం



అటవీప్రాంతంలో లభించే పుట్టతేనెకు గిరాకీ ఎక్కువ. అలాగే చెట్లపైన తొర తేనను కూడా తీసి విక్రయిస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం కూడా తేనె తయారీపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. ఇతర ప్రాంతాలకు కూడా గిరిజన ప్రాంతంలో సేకరించిన తేనెను విక్రయిస్తున్నాం.

– కపిలవాయి హరిసూర్య నారాయణ, తేనె తయారీ, విక్రయదారుడు, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

దుర్గంధభరితంగా గ్రంథాలయ పరిసరాలు

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయ పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. గ్రంథాలయానికి ఎదురుగా పెద్ద చెరువు గట్టుపై కబేళ దుకాణదారులు జంతు వ్యర్థాలను తీసుకువచ్చి పడేస్తుండడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. అంతేకాకుండా పరిసరాలు సైతం అధ్వానంగా మారుతున్నాయి. వేసవి సెలవు దినాలలో గ్రంథాలయాలలో ఆటవిడుపు కార్యక్రమాలతో పాటు విజ్ఞానపరమైన అంశాలను నేర్చుకోవడానికి వస్తున్న విద్యార్థులు దుర్గంధం, అపారిశుధ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లైబ్రరీ అధికారి తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పాఠకులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది కోరుతున్నారు.

కాటన్ దొరకు ఘననివాళి



పీడబ్ల్యూడీ కార్యాలయంలో కాటన్ విగ్రహం వద్ద జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ దొర జయంతిని పీడబ్ల్యూడీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఈ సీహెచ్ భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈ రవీంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై కాటన్ మహాశయుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బ్రిటిష్ సైనికాధికారులు భారతీయుల పట్ల నిరంకుశ ధోరణితో ఉండేవారని, కానీ కాటన్ మహాశయుడు బ్రిటిష్ సైనిక అధికారి బాధ్యతలనుంచి ధవళేశ్వరం ఆనకట్ట బాధ్యతలను చేపట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని భారతదేశపు ధాన్యాగారంగా మలిచారని డీఈ కొనియాడారు. ఆయన అడుగుజాడలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కానూరి లక్ష్మీనారాయణ వంటి మనదేశ ఇంజనీర్లు భారత దేశ నదులకు డ్యాములు నిర్మించారన్నారు.

జంగారెడ్డిగూడెంలో పోలింగ్ సరళి ఇలా...

పట్టణం, మండలంలో 76.67 శాతం ఓటింగ్ నమోదు



జంగారెడ్డిగూడెంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో సరాసరి 76.67 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో, మండలంలో కూడా మహిళలే అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 65.77 శాతం పోలింగ్ నమోదు కాగా, మండలంలోని 20 పంచాయతీల్లో 86.87 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 1,00,203 ఓటర్లు ఉండగా, వీరిలో 76,832 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 48,978 ఉండగా 38,044 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మహిళా ఓటర్లు 51,193 మందికిగాను 38,767 మంది ఓటు వేశారు. ఇతరులు పట్టణం, మండలంలో కలిసి 32 మందికిగాను 21 మంది ఓటు వేశారు. ఇందులో పట్టణంలో 28 మంది ఉంటే 21 మంది ఓటు వేయగా, మండలంలో ఉన్న నలుగురు ఓటు హక్కు వినియోగించుకోలేదు. మండలంలో అత్యధికంగా అమ్మపాలెంలో 95.47 శాతం పోలింగ్ నమోదుకాగా అత్యల్పంగా జొన్నవారిగూడెంలో 79.68 శాతం పోలింగ్ నమోదైంది.

గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు

గ్రామాలు	బూత్‌లు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
జంగారెడ్డిగూడెం	39	49,504	31,902	65.77
ఎ.పోలవరం	3	2228	1973	88.50
మంగిశెట్టిగూడెం	2	1159	1045	90.16
జొన్నవారిగూడెం	2	1255	1000	79.68
తాడువాయి	2	2019	1763	84.00
చల్లవారిగూడెం	1	873	762	87.28
మైసన్నగూడెం	3	2909	2473	85.00
పట్టెన్నపాలెం	2	1509	1388	92.00
అక్కంపేట	1	1038	965	93.00
శ్రీనివాసపురం	4	3962	3399	85.79
వేగవరం	5	4677	4006	85.65
చక్రదేవరపల్లి	2	1575	1394	88.50
గుర్వాయిగూడెం	2	1366	1187	86.90
నాగులగూడెం	2	1676	1415	84.42
పుట్లగట్లగూడెం	2	1592	1464	91.95
తిరుమలాపురం	2	1569	1325	84.44
పేరంపేట	3	2883	2504	86.85
కేతవరం	3	3389	3022	89.17
పంగిడిగూడెం	3	3044	2569	84.39
లక్కవరం	6	7073	5988	84.66
టెక్కినవారిగూడెం	2	1317	1220	92.63
దేవులపల్లి	2	2094	1835	87.63
అమ్మపాలెం	1	619	591	95.47
కట్టవపాదలగూడెం	1	860	783	91.00
చల్లవారిగూడెం (ఆర్‌అండ్‌ఆర్ కాలనీ)	1	153	129	84.31
నిమ్మలగూడెం	1	800	730	91.25
మొత్తం	97	100203	76832	76.67

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

21 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల: ఆనాటి ఆ స్నేహమానంద గీతం.. ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం.. అని ఆ పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 21 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఇందుకు ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల వేదికయ్యింది. దాంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం కనిపించింది. 2002–2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆ నాటి మధుర స్మృతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనాటి ఉపాధ్యాయులు ఐవీఎస్‌కే ప్రసాద్, సుబ్బరాజు, సిబ్బంది గోపాలకృష్ణ, రామ్మోహన్‌రావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆ తరువాత జరిగిన విందు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం వైర్‌లెస్ మైక్ సెట్‌ను వారు బహుకరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు శివన్నారాయణ, బలరామ్, ఎం.దుర్గ, వి.కల్యాణి, వై.నారాయణమూర్తి, ఎం.నారాయణమూర్తి, ఆదిత్య జగన్నాద్, కె.నాగవిజయ్, పి.నాగరాజు, డి.లావణ్య, పి.సుమతి, పి.శివప్రసాద్, పి.కత్యాయనిదేవి, ఐ.పద్మ, ఎస్.పద్మ, వై.నాగాంజలి, ఉన్నీసా, మంజు, ఎం.నాగరాజులను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీలత తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

తింటే చల్లదనం.. ఒంట్లో చలాకీతనం

- వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలు, పుచ్చకాయలు
- గిరిజన ప్రాంతంలో వేసవిలో జోరుగా విక్రయాలు
- ముంజులు తింటే ఆరోగ్యానికి శ్రేయస్కరమే అంటున్న వైద్యులు



ముంజలు తీస్తున్న దృశ్యం, తాటి ముంజలు (అంతర చిత్రం)



చల్లదనం ఇచ్చే పుచ్చకాయ

బుట్టాయగూడెం: ప్రచండ భానుడు భగభగమంటూ గత వారం రోజులుగా తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. ఒకపక్క తీవ్రమైన ఎండలు, మరోపక్క వేడి గాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాటి ముంజలు, పుచ్చకాయలు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. తాటిచెట్లకు కాసే ముంజకాయలు ఎండాకాలంలో మాత్రమే లభిస్తుంటాయి. వేసవి తాపాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడేందుకు ఉపయోగపడతాయని సూచిస్తున్నారు. అయితే ఎండలు తీవ్రంగా ఉండటంతో గిరిజన ప్రాంతంతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో, రోడ్ల వెంబడి తాటి ముంజలు విక్రయాలు చేస్తూ అనేక మంది వ్యాపారులు కనిపిస్తున్నారు. ఏ సీజన్‌లో దొరికే పండ్లు ఆ సీజన్‌లోనే తినడం మంచిదని వైద్యులు సైతం సూచించడంతో వేసవిలో లభించే తాటి ముంజలను అనేకమంది కొనుగోలు చేస్తున్నారు. ముంజలు దొరికే ప్రదేశాలకు వెళ్లి కుటుంబాలకు సరిపోయే ముంజలను తీసుకువెళ్తున్నారు. మార్కెట్‌లో ముంజల వ్యాపారం చేసే వ్యాపారులకు ఏప్రిల్, మే నెలలో అధికంగా ఆదాయం వస్తుంది.

సహజసిద్ధంగా దొరికే తాటిచెట్లు

తాటిచెట్లు బీడు భూములు, పొలంగట్లు, తదితర ప్రదేశాల్లో సహజసిద్ధంగా పెరుగుతాయి. కొన్ని గ్రామాల్లో తాటి వనాలను సహజసిద్ధంగా తయారు చేస్తూ ఉంటారు. తాటి చెట్టుతో విత్తు నుంచి చెట్టు వరకూ ప్రయోజనం ఉండటంతో ముఖ్యంగా గిరిజన రైతుల పొలాల్లో ఈ చెట్లను పెంచుతూ ఉంటారు. ఈ చెట్లు 10 నుంచి 35 మీటర్ల ఎత్తు పెరిగినా ఎటువంటి ఇబ్బంది ఉండదు. వేసవి కాలంలో తాటి చెట్ల నుంచి లభించే కల్లు అనేక మంది గిరిజనులకు ఉపాధిమార్గం చూపిస్తుంది. అలాగే తాటి ముంజలు, తాటి కాయలు, తాటి ఆకులు సైతం వారికి ఆదాయ మార్గాలను చూపిస్తుంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం తాటాకు రూ.8 నుంచి రూ.10 వరకూ ధర ఉంటుంది. అలాగే తాటి ముంజలు కొంత మంది 12 ముంజలు రూ.40 విక్రయిస్తుండగా మరి కొందరు 18 ముంజులు రూ.50 విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. గిరిజన ప్రాంతంలో సుమారు 75 కుటుంబాలకు పైగా ముంజలు, తాటి ఆకుల విక్రయాలతో వేసవి కాలంలో జీవనం సాగిస్తున్నారు. అలాగే పుచ్చకాయల వ్యాపారులు కూడా అనేక చోట్ల కొట్లను ఏర్పాటు చేసుకుని అమ్మకాలు జరుపుతున్నారు.

తాటి ముంజల వల్ల ఉపయోగాలు

- వేసవికాలంలో ఎన్ని నీళ్లు తాగినా అలసిపోయి నీరసానికి గురయ్యేవారు తాటి ముంజలను తినడం వల్ల చలాకీగా ఉంటారు.
- తాటి ముంజల్లో ఏ, బీ, సీ విటమిన్లతో పాటు జింక్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల వ్యక్తుల బరువు తగ్గించేందుకు దోహదం చేస్తాయి.
- శరీరంలో ఎనర్జీ లెవల్‌ను పెంపొందించి అలసటను దూరం చేస్తుంది.

తాటి ముంజలు తింటే మంచిదే



వేసవి కాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే తాటి ముంజలు తినడం మంచిదే. ఈ ముంజల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ముంజలు తినొచ్చు. ఎండలో తిరిగేవారికి డీహైడ్రేషన్‌కు గురి కాకుండా తాటి ముంజలు ఎంతగానో పనిచేస్తాయి. ఈ ముంజలు పెద్ద వయస్సు వారికి కూడా ఆరోగ్యపరంగా మేలు చేస్తాయి.

– జి. సురేష్ ఇన్‌చార్జి డీఎంఓ, పులిరామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యులు, బుట్టాయగూడెం మండలం

ఫాతిమా మాత టవర్ పండుగ

ఏలూరు రూరల్: పునీత మదర్ థెరిస్సా 27వ విచారణ మహోత్సవాలు ఫాతిమా మాత టవర్ పండుగ వేడుకలు బుధవారం వంగాయగూడెంలో ఫాదర్ జిజ్జువరపు మైఖేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆర్‌సీఎం ఏలూరు వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల, ఏలూరు కెథ్రడల్ చర్చి ఫాదర్ ఐ.మైఖేల్ పునీత మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రేమ, సేవ, శాంతి గుణాలను కలిగిఉండి సమాజంలో విస్తరింపజేయాలన్నారు. దేవుని ఆజ్ఞలకు లోబడి ప్రతిఒక్కరూ నిత్య ప్రార్థనల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఏటా ఫాతిమా మాత టవర్ పండుగ మదర్‌థెరిస్సా మహోత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విచారణ గురువులు మైఖేల్, ముఖ్యఅతిథులు ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్‌ను సత్కరించారు. వేడుకల్లో పెదపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జాకబ్, ఫాదర్ జోసెఫ్, సంఘస్తులు పాల్గొన్నారు.